క్లుప్తంగా

బాబాను దర్శించుకున్న డాక్టర్ బొత్స సందీప్



దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న డాక్టర్ బొత్స సందీప్

విజయనగరం టౌన్: ధీరా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బొత్స సందీప్ బాబామెట్టలో ఉన్న ఖాదర్‌వలీబాబా దర్గాను బుధవారం దర్శించుకున్నారు. దర్గా దర్బార్ నిర్వాహకులు డాక్టర్ ఖలీల్‌బాబు ఆధ్వర్యంలో దర్బార్‌లో విశిష్ట పూజలు నిర్వహించి, గులాబీలను బాబాకు సమర్పించారు. అనంతరం ఆశ్రమమంతా కలియతిరిగారు. బాబా విశిష్టతను ఖలీల్‌బాబు వివరించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



రోడ్డు భద్రతపై అవగాహన ఫ్లెక్సీని ప్రారంభిస్తున్న డీటీసీ రవీంద్రనాథ్

విజయనగరం టౌన్: స్థానిక ఆర్‌టీఓ కార్యాలయంలో అబ్జర్వేషన్ ఆఫ్ నేషనల్ రోడ్ సేఫ్టీ ఫ్లెక్సీని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రవీంద్ర చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వివిధ కళాశాలల్లోనూ, వాహన డ్రైవర్లకు, లారీ, ఆటో, డ్రైవింగ్ స్కూల్ వారికి భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రోడ్డు భద్రతా కమిటీ జిల్లా అధ్యక్షుడు మజ్జి అప్పారావు, కార్యదర్శి హరిబాబు, సభ్యులు దేవరశెట్టి శ్రీరామూర్తి, ఆర్లి కృష్ణ, తరుణ అంకుశం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగునికి బ్యాటరీ సైకిల్ పంపిణీ



గురువులుకు ట్రై సైకిల్‌ను అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: రాజాం మండలం రాజాం పంచాయతీ పరిధిలోని డోలపేటకు చెందిన దివ్యాంగుడు దన్నాన గురువులుకు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బ్యాటరీ ట్రై సైకిల్‌ను బుధవారం అందజేశారు. జెడ్పీ చైర్మన్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ

విజయనగరం ఫోర్ట్: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు మాదిగలు అంతా పోరాటం చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యు.బ్రహ్మయ్య మాదిగ అన్నారు. స్థానిక యూత్ హాస్టల్‌లో బుధవారం జరిగిన ఎంఆర్‌పీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అంశాన్ని సుప్రీం కోర్టుపై నెట్టివేయడంలో బీజేపీ ప్రభుత్వ కుట్ర ఉందని ఆరోపించారు. సుప్రీం కోర్టు వర్గీకరణపై త్వరలోనే తీర్పు ఇవ్వనుందని చెప్పారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్లు విజయ్ కుమార్ మాదిగ, బ్రోదర్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు పెంకి సుధాకర్ మాదిగ, సురగాల లక్ష్మణరావు, చిన్నారావు, సురేష్, చంటి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం కొనసాగించాలి



దీక్ష వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న యూనియన్ నాయకులు

నెల్లిమర్ల: పాత పెన్షన్ విధానం కొనసాగించాలని కోరుతూ ఫిబ్రవరి 4న విశాఖపట్నంలో సాగర సంగ్రామ దీక్ష చేపడుతున్నట్టు ఏపీసీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు శ్యామ్, రమణ, రమేష్ పేర్కొన్నారు. స్థానిక రామతీర్థం జంక్షన్‌లోని ఎంపీపీ స్కూల్‌లో బుధవారం దీక్షకు సంబంధించిన వాల్‌పోస్టరును విడుదల చేశారు. కార్యక్రమంలో నెల్లిమర్ల, గుర్ల మండలాల సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులంతా పాల్గొన్నారు.

మాట తప్పని సీఎం జగన్

- అండగా నిలవాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల పిలుపు
- మళ్లీ గెలిపిస్తే సమస్యలు లేని నగరంగా విజయనగరం
- పండగ వాతావరణంలో వైఎస్సార్ ఆసరా సంబరాలు



వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్నడిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

విజయనగరం: ఇచ్చిన మాటపై నిలబడేవాడే నిజమైన నాయకుడని, అటువంటి మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. మాట తప్పడం, మడమ తిప్పడం జగన్‌మోహనరెడ్డికి అలవాటు లేదని ఆయన స్పష్టం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం నాలుగో విడత ఆసరా నిధులను జమ చేసిన ముఖ్యమంత్రికి మహిళలంతా అండగా ఉండి, ఆశీర్వదించాలని కోరారు. నాలుగో విడత ఆసరా సంబరాలను స్థానిక రాజీవ్ స్టేడియంలో బుధవారం ప్రారంభించారు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని 37,406 సంఘాలకు చెందిన 33,368 మంది మహిళలకు రూ.25.80 కోట్లు, మండల పరిధిలోని 794 సంఘాలకు చెందిన 8,413 మంది మహిళలకు రూ.5.15కోట్లను చెక్కులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నగర మేయర్‌లతో కలిసి అందజేశారు. అంతకుముందు జ్యోతీ ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రజాప్రతినిధులు, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి చిత్రపటానినికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోలగట్ల మాట్లాడుతూ, 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలేవీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు.

2019 ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలన్నిటినీ అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డికి దక్కుతుందన్నారు. పాలనలో తేడాను ప్రజలే బేరీజు వేసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతీఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడం తమ ప్రభుత్వ గొప్పతనంగా పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి అని కొనియాడారు. ప్రజలంతా మరోసారి ముఖ్యమంత్రికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. విజయనగరం పట్టణంలో ఇటీవల కాలంలో వచ్చిన మార్పును, జరిగిన అభివృద్ధిని గమనించాలని కోరారు. తనను మళ్లీ గెలిపిస్తే విజయనగరాన్ని సమస్యలు లేని పట్టణంగా రూపొందిస్తానని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు కృషి చేస్తానని, పెద్ద చెరువును పూర్తిగా సుందరీకరణ చేస్తానని కోలగట్ల హామీ ఇచ్చారు.

ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ తన పాదయాత్రలో ప్రజల కష్టాలను తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి, అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలన్నిటినీ నెరవేర్చారని చెప్పారు. నవరత్నాల పథకం ద్వారా పేద ప్రజలను అన్ని విధాలా ఆదుకున్నారని అన్నారు. రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి చంద్రబాబు నాయుడు మహిళలను మోసం చేశారని విమర్శించారు. వలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తెచ్చారని అన్నారు. ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌లు కోలగట్ల శ్రావణి, లయా యాదవ్, ఏఎంసీ చైర్‌పర్సన్ శశి భార్గవి, పొదుపు సంఘాల సభ్యులు గంటా శ్రావణి, గౌరి తదితరులు మాట్లాడారు. బదిలీపై వెళ్తున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావులను ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ సుధాకర్, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి, మండల స్పెషల్ ఆఫీసర్ అరుణకుమారి, ఎంపీడీఓ గంటా వెంకటరావు, మున్సిపల్ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ ఎస్‌వివి.రాజేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాధ్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, మండల అధ్యక్షుడు జమ్ము శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, డీఆర్‌డీఏ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న ముఖ్య అతిథులు

జగనన్నే కొండంత అండ



మేము హుకుంపేట ప్రాంతంలో నివాసముంటున్నాం. నా భర్త పండ్ల వ్యాపారం చేస్తుంటారు. మాకు ఇద్దరు ఆడపిల్లలు. ప్రస్తుత సమాజంలో ఒక్కరి సంపాదనతో ఇళ్లు గడవటం కష్టతరంగా మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు విడతల్లో ఆసరా పథకం కింద రూ.38వేలు మంజూరు చేశారు. ఆ డబ్బులతో నేను సొంతంగా టిఫిన్ కొట్టు పెట్టుకున్నాను. నా పిల్లలకు మంచి భవిష్యత్ ఇచ్చేందుకు జగనన్న అందించిన సాయం వెలకట్టలేనిది.

– జి.అప్పలకొండ, హుకుంపేట, విజయనగరం



జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఇతర మహిళలు

పోలీస్ సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు



పదవీ విరమణ పొందిన వారికి ఆత్మీయ వీడ్కోలు పలుకుతున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: సుదీర్ఘ కాలం పోలీసు శాఖలో బాధ్యతాయుతంగా ఎంతో క్రమశిక్షణతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన ట్రాఫిక్ ఎస్‌ఐ కుంచే విజయ వరప్రసాదరావు, ఏఆర్ ఎస్‌ఐ ములగపాటి వెంకటరమణలకు జిల్లా పోలీసు శాఖ తరఫున ఎస్పీ ఎం.దీపిక పోలీసు కార్యాలయంలో బుధవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో వారు చూపిన క్రమశిక్షణ, అంకితభావమే పోలీసు శాఖలో వారిని ఉన్నతంగా నిలిపిందన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ మండా జావలి అల్ఫాన్స్, విజయనగరం ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఎస్‌బీ సీఐలు కెకెవి.విజయనాథ్, ఇ.నరసింహమూర్తి, టాస్క్‌ఫోర్స్ సీఐ అశోక్ కుమార్, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్ని, ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పతివాడ అప్పలనాయుడు తదితరులు

పూసపాటిరేగ: ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ ఎస్.సత్యనారాయణరాజు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కిలుగుపేట గ్రామంలో పూడి తౌడు రెడ్డి, పూడి మహేష్‌లు తమ ఇంటి ముందు వున్న ప్రభుత్వ భూమిలో తాగునీటి బోరును కప్పి ప్రహరీ నిర్మాణం చేశారని తెలిపారు. ఇంటి ముందు రస్తాను ఆక్రమించి నిర్మాణం చేయడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ప్రహరీ తొలిగించి, రస్తాను పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో గ్రామస్తులు దారపు గున్నారెడ్డి, దారపు అప్పలసూర్రెడ్డి, మహంతి శ్రీనివాసురావు, మహంతి జనార్దనరావు, గుజ్జు సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మన్ కుటుంబానికి ఆర్థిక సహాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని గుషిణి గ్రామ సచివాలయ పరిధిలో జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్న రెడ్డి కోటరావు అనే యువకుడు ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏఈ పిచ్చయ్యతో పాటు తోటి ఉద్యోగులు జామి గ్రామంలోని కోటరావు కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. వారు సేకరించిన రూ.1,80,000 విరాళాన్ని మృతుడి తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ జూనియర్ లైన్‌మెన్లు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి కమిషనర్‌గా సాంబమూర్తి

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్‌గా ప్రజా ఆరోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి బాధ్యతలు నిర్వహించనున్నారు. ఇటీవల మున్సిపల్ శాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా కార్పొరేషన్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన ఆర్.శ్రీరాములనాయుడుతో పాటు అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన పి.వి.డి.ప్రసాద్‌రావులకు బదిలీ అయిన సంగతి విదితమే. ఈ మేరకు ఇరువురు అధికారులు బుధవారం వారి విధుల నుంచి రిలీవ్ అయ్యారు. వారి స్థానంలో నూతనంగా బాధ్యతలు చేపట్టాల్సిన కమిషనర్ అసిస్టెంట్ కమిషనర్లు మరో రెండు రోజుల్లో రానున్న నేపథ్యంలో ఇన్‌చార్జి కమిషనర్‌గా ప్రజారోగ్య అధికారికి బాధ్యతలు అప్పగించారు.

సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్ సరోజిని

నెల్లిమర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని కోరారు. నగర పంచాయతీ పరిధిలోని 4వ సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు సత్వర ఆరోగ్య సేవలు అందించడానికి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, కౌన్సిలర్లు చిక్కాల సంతోష్‌కుమార్, బూర సుజాత, నాయకులు నౌపాడ శ్రీనివాసరావు, బూర సత్యనారాయణ, మజ్జి గణేష్,కారుకొండ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

3వ డివిజన్‌లో 'గడప గడపకు..'



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: నగరంలోని 3వ డివిజన్ ఖాదర్‌నగర్‌లో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల వివరాలను వెల్లడించారు. లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్‌లెట్లను అందజేశారు. స్థానిక సమస్యలపై ఆరా తీసి అవసరమైన చర్యలు తీసుకోవాలని అక్కడున్న సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా డివిజన్ ఇన్‌చార్జి వేములు రాంప్రసాద్, మెండా రమణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల తీరు ఏ విధంగా ఉందో అడిగి తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాలుగో డివిజన్ కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పైడితల్లిని దర్శించిన జేసీ



జేసీకు అమ్మవారి వేదాశీస్సులు అందజేస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: జిల్లా జేసీగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన కె.కార్తీక్ ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ వేదపండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు.

డీఎస్సీ పోస్టుల సంఖ్య పెంచాలి

విజయనగరం ఫూల్‌బాగ్: డీఎస్సీ పోస్టుల సంఖ్య పెంచాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.హరీష్, ఎన్.రుద్రప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. డీఎస్సీ ప్రతిపాదనను మంత్రి మండలి ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేశారు. అయితే గత నాలుగేళ్లుగా ఊరిస్తూ కేవలం 6100 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. ప్రభుత్వం డీఎస్సీ అభ్యర్థుల పోస్టులకు సంఖ్య పెంచాలని కోరారు.

ఎస్‌ఐగా సన్యాసినాయుడు బాధ్యతల స్వీకరణ

పూసపాటిరేగ: పూసపాటిరేగ ఎస్‌ఐగా ఎ.సన్యాసినాయుడు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన బాలకృష్ణకు సీఐగా ప్రమోషన్ రావడంతో సాలూరు రూరల్ సీఐగా వెళ్లారు. సన్యాసినాయుడు వీఆర్‌లో ఉంటూ పూసపాటిరేగ స్టేషన్‌లో జాయిన్ అయ్యారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

'ఆసరా'తో పొదుపు సంఘాల ప్రగతి

- ఆసరా సంబరాల్లో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు, చిత్రంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



ఆసరా సంబరాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు

పూసపాటిరేగ/భోగాపురం: మహిళామణులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అగ్ర తాంబూలం ఇచ్చి అక్కచెల్లమ్మలు జీవితాలలో వెలుగులు నింపిందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. ఎన్నికల హామీలలో భాగంగా జగన్‌మోహన్‌రెడ్డి స్వయం సహాయక సంఘాలకు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి నాలుగు విడతలలో పూర్తిగా రుణమాఫీ చేశారని పేర్కొన్నారు. భోగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఆసరా సంబరాలలో భాగంగా 1055 సంఘాలలోని 11,521 మంది సభ్యులకు రూ.7కోట్ల 18 లక్షలు రుణమాఫీ చెక్‌ను మహిళాసంఘాలు సభ్యులకు వారు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసురావు మాట్లాడుతూ 2014 ఎన్నికలో మాజీ సీఎం చంద్రబాబు నాయుడు డ్వాక్రా రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేయడంతో మహిళా సంఘాలు సభ్యులు అప్పుల్లో కూరుకుపోయారన్నారు. వాస్తవ పరిస్థితిని గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే నాలుగు విడతలుగా రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకొని నాలుగు విడతలు రుణమాఫీ చేశారన్నారు. భోగాపురం మండలంలో నాలుగు విడతలలో 11,521 మంది మహిళా సంఘాలు సభ్యులకు రూ.28.69 కోట్లు పూర్తిగా రుణమాఫీ చేశారని గుర్తుచేసారు. పేదలు, పెత్తందారుల మధ్య 2024లో జరిగే ఎన్నికల యుద్ధంలో అక్కచెల్లమ్మలు జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రతి మహిళా ఆర్థిక స్వావలంబన సాధించాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన లక్ష్యం అన్నారు. అందుకే ప్రతి పథకంలోను మహిళలను భాగస్వామ్యం చేస్తూ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికలలో ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న కుయుక్తులను అడ్డుకోవాలని సూచించారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, నియోజకవర్గం పరిశీలకుడు అంధవరపు సూరిబాబు, భోగాపురం, నెల్లిమర్ల వైఎస్సార్‌సీపీ మండల పార్టీల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, చనుమల్ల వెంకటరమణ, జెడ్పీటీసీ పడాల మంజులత, వైస్ ఎంపీపీలు పడాల సత్యవతి, డి.సూర్యనారాయణరాజు, కార్పొరేషన్ డైరెక్టర్లు ఉప్పాడ శివారెడ్డి, మైలపల్లి నర్సింహులు, చెల్లిబోయిన నర్సింగరావు, పడాల భానుప్రకాశ్, సుందర హరీష్, పడాల శ్రీనివాసరావు, కర్రోతు వెంకటరమణ, పిడుగు రాంబాబు, డి.చంద్రశేఖర్, యు.విజయభాస్కరరెడ్డి, పట్న తాతయ్యలు, ఎంపీడీఓ అప్పలనాయుడు, తహసీల్దార్ బంగార్రాజు, వెలుగు ఏపీ రాజ్‌కుమార్, ఏపీఎంలు పెంటంనాయుడు, రమణ, అరుణ పాల్గొన్నారు.

సీఎం జగన్ మహిళా పక్షపాతి



జీవనజ్యోతి డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. మా సంఘానికి ఈ దఫా రూ.3లక్షలు ఆసరాగా వచ్చాయి. ఒక్కో సభ్యురాలికి రూ.10వేలు అందాయి. ఇచ్చిన మాట తప్పకుండా సీఎం జగన్ ఆర్థిక సాయం చేస్తూ మాకు అండగా నిలిచారు. మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. సీఎంకు రుణపడి ఉంటాం. – దుర్గాస్ చిన్నమ్మలు, డ్వాక్రా మహిళ, నందిగాం, భోగాపురం

కిరాణ వ్యాపారంతో నిలదొక్కుకున్నా..



నేడు మహాత్మాగాంధీ డ్వాక్రా సంఘంలో సభ్యురాలిని. వైఎస్సార్ ఆసరా కింద నాలుగు విడతల్లో రూ.4.80లక్షలు రుణమాఫీ జరిగింది. సంఘంలోని పది మంది సొమ్ము పంచుకున్నాం. నాకు అందిన సొమ్ముతో హైవే పక్కన చిన్న గది అద్దెకు తీసుకుని కిరాణా దుకాణం పెట్టుకుని వ్యాపారం చేస్తున్నాను. ఆర్థికగా నిలదొక్కుకున్నాం. ఇదంతా జగనన్న పుణ్యమే. నా పిల్లలు ఇద్దరు బీటెక్ చదువుతున్నారు. ఇదంతా జగనన్న చలవే.. మళ్లీ జగనన్నే సీఎం కావాలి. – పి.కృష్ణవేణి, మహాత్మాగాంధీ డ్వాక్రా సంఘం సభ్యురాలు, భోగాపురం

సీఎం జగన్ ఇచ్చిన మాట నిలుపుకున్నారు..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం పదవి చేపట్టిన వెంటనే డ్వాక్రా రుణమాఫీ చేసి మాట నిలుపుకున్నారు. మాది బాపూజీ గ్రూపు, మా సంఘంలో పది మంది సభ్యులం. మా సంఘంలో ఒక్కొక్క సభ్యురాలికి రూ.11 వేలు వంతున నాలుగు విడతల్లో రూ.44 వేలు మాఫీ అయింది. – రామిశెట్టి మంగవేణి, బాపూజీ, డ్వాక్రా గ్రూపు సభ్యురాలు, భోగాపురం